


గోపాలాని కొక పెద్ద ధర్మసందేహం పట్టుకుంది—ఆ సినిమా ట్రూపులో బొంబాయి వెళ్ళిన తన తమ్ముడు పార్వతీశం ఎవతెనన్నా తగులు కున్నాడా, లేదా?

తన తమ్ముడు నైతికక్షేమంతో గోపాలాని కేం పనో ఊహించటం కష్టం. తమ్ముడు ఎవతెనన్నా తగులుకున్నాడని రుజువైతే తన కెక్కువ తృప్తో, నీతిగా ఉన్నాడంటే ఎక్కువ తృప్తో గోపాలానికే తెలీదు.

గోపాలానికి ఒక్కటే తెలుసు: పార్వతీశాన్ని తను పెంచి పెద్దవాణ్ణి చేశాడు. చదువు పూర్తిగా చెప్పించాడు! ఒక ఇంటివాణ్ణి చెయ్యటం మాత్రమే తనమీద ఉంది. ఈ పరిస్థితుల్లో పార్వతీశం ఇప్పుడే కోతికళలు పోవటం జరిగితే, ఏ నిక్షేపమంటి పిల్లనో తెచ్చి వాడి కంటగట్టటం తన వల్ల ఒక్కనాటికూడా జరగదు!

తన తమ్ముడిమీద కంటె, గోపాలానికి, ఆ తమ్ముడికి ముడిపెట్టబోయే పిల్లమీద ఇంత అభిమానం దేనికో అది కూడా మనం సులభంగా ఊహించలేం.

ఏమైనా పార్వతీశం ప్రవర్తనను గురించి స్పష్టంగా తెలుసుకునేదాకా గోపాలానికి నిద్రపట్టే లక్షణాలు కనుపించలేదు.

అసలే సినిమా కంపెనీ! అందరూ లఫూటుగాళ్లు చేరతారు. ఆపైన ఆడవాళ్ళూ మగవాళ్ళూ కలిసి తైతక్కలాట్టం! ఆ ముండలన్నా సంసార్లా అంటే—సంసార్లు హాయిగా మొగు

కొడవటిగంటి కుటుంబరావు

ళ్ళకు వంట చేసిపెడుతూ పిల్లల్ని కనక సినిమాల్లో కెందుకు పోతారు ?

పార్వతీశం వెంట తమ గ్రామం నించి ఇంకా అయిదారుగురు వెళ్లారు అసలా సినిమా తీసిన కంపెనీ ఆ వూరి వాళ్ళదే. అందుకని గోపాలం నలుగురి దగ్గిరా ఆరా తియ్యటానికి బయల్దేరాడు

"ఏమోయ్, లక్ష్మీనారాయణా! నువుకూడా బొంబాయి వెళ్ళావు గామల్లు. ఏమిటి కబుర్లు? మా తమ్ముడు పార్వతీశం, ఒళ్లు దగ్గిరపెట్టి మసులుకున్నాడా?" అన్నాడు గోపాలం

"వాళ్ళు ఎవరి దగ్గిర పెట్టి?" అన్నాడు లక్ష్మీనారాయణ విచక్షణగా

తాగుబోతు వెధవ! వాణ్ణి అడగటం తనదే పొరపాటు!

"ఏమండీ, కృష్ణశాస్త్రిగారూ, మీ రంతా కలిసే ఉన్నారు గామాలు! మా తమ్ముడు, పార్వతీశం, ఆడవాళ్ల జోలి కేమి-పోలేదుకద?"

"ఎబ్బే, అటువంటి దేమీ ఉన్నట్టు లేదులెండి నా కతనితో ఆట్టే పరిచయం కలగలేదుగాని—వస్తాను!"

ఎందుకు చెబుతాడూ? అంతా తోడుదొంగలు!

"ఏమోయ్, సూర్యం మావాడు బొంబాయిలో ఛటాచోరుముండల్నెవర్ని తగులుకోలేదుగద?"

"ఓ రహస్యం చెప్పనా? మళ్ళీ ఎవరితోనన్నా అనేరు! నేను తలుపు కంతల్లోనుంచి చూశాగాని, నా కేమీ కనిపించలా. చీకట్లో! తెలీనిమాట చెప్పి ఎట్లా పాపం కట్టుకునేదీ!"

వీ డో దొమ్మరముండాకొడుకు! చిన్నంతరమూ పెద్దంతరమూ ఎరగడు!

ఇంత శ్రమపడి ఆ ముండ దగ్గిరికి పోయి అ దేమంటుందో ఆ సంగతి కూడా తేల్చుకొస్తే సరిపోతుందిగా!

గోపాలం ప్రాణా లరిచేతిలో పెట్టుకొని దాని ఇల్లు విచారించుకుంటూ వెళ్ళాడు

పొద్దూకిం దప్పుడే. "కూర్చోండి, పంతులుగారూ?" అంటూ అది తన ఎదటే చీరవిప్పి మరోచీర కట్టసాగింది

"అయితే—ఇదుగో—చూడూ! నీ పే రేమిటో? మీ వెంట పార్వతీశమని ఒక కుర్రా డొచ్చాడే! వాడు మీతో వచ్చిన ఆడవాళ్ళ నెవర్నన్నా మరిగాడా?"

"ఆ అబ్బాయి అటువంటి వాడు ఐతే నే నొదిలిపెడతానుటండీ, పంతులుగారూ? వెళుతున్నా రేం? రాత్రి కుండరూ?"

అదురుతున్న గుండెతో గోపాలం బయటపడ్డాడు తన తమ్ముడి శీలం చెడలేదని రూఢి అయిందిగాని, అందువల్ల కలగదగిన సంతోషం మాత్రం గోపాలానికి కలగలేదు.